రావణ వాహనంపై దేవదేవుడు



శ్రీశైలం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఐదో రోజు ఘనంగా నిర్వహించారు. బుధవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు రావణవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. లోకకళ్యాణం కోసం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్ర పారాయణాలు, చతుర్వేద పారాయణాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రావణవాహనంపై ఆశీనులను చేసి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, డమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించి తరించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

● ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు మంగళవారం సంక్రాంతి పర్వదినం రోజున సాయంత్రం స్వామి, అమ్మవార్లు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు లీలా కల్యోణత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారికి నూతన వస్త్రాలను, వెదురు బియ్యం, ఆకులతో తయారు చేసిన బాసికాలు, స్వామివారి యజ్ఞోపవీతం, అమ్మవారి వడ్డాణం, ఇతర సామగ్రిని సమర్పించారు.

● శాస్త్రోక్తంగా గో పూజ

కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని గో పూజా మహోత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. నిత్య గో సేవతో పాటు ఆవులకు, దూడలకు పూజలు జరిపారు. అనంతరం గోవులకు నూతన వస్త్రాలు సమర్పించారు.

● నేడు యాగ పూర్ణాహుతి, ధ్వజావరోహణ


ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి అనంతరం యాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజపటాన్ని అవరోహణ చేస్తారు.

● వైభవంగా గోపూజ
● కనుల పండువగా లీలా కల్యాణోత్సవం





గోపూజ నిర్వహిస్తున్న ఆలయ ఈఓ



బంగారు వర్ణంలో శ్రీశైల మల్లన్న ఆలయం





రావణవాహన సేవపై విహరిస్తున్న భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారు





బనగానపల్లెను తీర్చిదిద్దుతాం

● 56.2 కిలోమీటర్ల మేర అండర్ డ్రైనేజీ వ్యవస్థ : మంత్రి బీసీ



అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణాన్ని స్వచ్ఛ బనగానపల్లె పట్టణంగా తీర్చిద్ది, అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో రూ. 30.66 కోట్ల వ్యయంతో 56.2 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు, జుర్రేరువాగుకు ఇరువైపులా సమాంతరంగా భూగర్భ కాలువ నిర్మాణ పనులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నాగులకట్ట వద్ద భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టానని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అండర్ డ్రైనేజీ పనులను నిలిపివేసిందన్నారు. డ్రైనేజీ కాల్వలు సరిగాలేక ప్రజలు పట్టణంలో అనారోగ్యం పాలవుతున్నట్లు తెలిపారు. వచ్చే రెండున్నరేళ్లలో అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు మధ్యలో డ్రైనేజీ ఏర్పాటు చేసి పనులు వేగవంతంగా చేయాలని కోరారు. బనగానపల్లె పట్టణంలో ఎక్కడా డ్రైనేజీ కాల్వలు కనపడరాదన్నారు. గత వైసీపీ పాలనలో డ్రైనేజీ వ్యవస్థ పూడిపోవడంతో రోడ్లపై మురుగు నీళ్లు నిలిచి ప్రజలు అనారోగ్యం పాలయ్యారన్నారు. పట్టణంలో 56.2 కిలో మీటర్ల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, మురుగునీరు జుర్రేరులో కలవకుండా వాగుకు ఇరువైపులా 3.6 కిలోమీటర్ల మేర సమాంతర భూగర్భ కాలువలు నిర్మిస్తామని అన్నారు. దీని కోసం పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంపీడీవో రమణ, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ వెంకటరమణ, టీడీపీ నాయకులు అన్వర్‌సాహెబ్, అల్తాఫ్‌హుసేన్, అమీర్‌జాన్, అల్లాబకాస్, నియాజ్, అన్నూ, అహమ్మద్‌హుసేన్, సర్పంచ్ తులసిరెడ్డి, అమరనాథరెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణానా

హరహర మహాదేవ

● వైభవంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం
● జనసంద్రమైన ఎమ్మిగనూరు
● వేలాదిగా హాజరైన భక్తులు



ఎమ్మిగనూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంధ్యా వేళ.. మంగళవాయిద్యాలు.. భక్తుల శివనామస్మరణతో ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజారు ప్రాంతం మారుమోగింది. రథవీధులు భక్తజనంతో నిండిపోయాయి. వేదపండితులు వేదమంత్రాలను వల్లిస్తుండగా ఆదిదంపతులను భక్తి శ్రద్ధలతో.. వేద మంత్రాలతో మహారథంపై కొలువుదీర్చారు. అందరి చూపు రథం కదలిక వైపే.. అందరి మదిలో భక్తిభావం.. సమయం సాయంత్రం 6:07 గంటలకు రథం ముందుకు సాగింది. ఒక్కసారిగా హరోం..హర.. శంభోశంకరా.. జయహో నీలకంఠేశ్వరా.. అంటూ నినదించారు. రథ చక్రాలు మార్కండేయుడి గుడివైపు 6:15 గంటలకు మార్కండేయుడి సన్నిధానానికి రథం చేరింది. అక్కడ పూజలు చేసి 6:33 గంటలకు రథం యథాస్థానానికి చేరడంతో రథోత్సవం ముగిసింది. మహారథంపై ఆదిదంపతుల ఊరేగింపు కళ్లారా చూసి తరించాలని భక్తులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్యదైవం నీలకంఠేశ్వరస్వామి మహారథోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. ఉదయం నుంచే ఆలయ నిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ధర్మకర్త ఎద్దులింటి మాచాని నీల మురళీధర్ ఆధ్వర్యంలో ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అలాగే మేళతాళాలతో గడిగే నాగప్ప కుటుంబీకులు కుంభం తీసుకొచ్చారు. రథం ముందు వేదపండితులు హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణవాసులు, చుట్టుముట్టుగ్రామాల ప్రజలు, భక్తులు తేరుబజారు ప్రాంతానికి చేరుకున్నారు. రథోత్సవం సమయంలో ఏ ప్రమాదం జరుగకుండా ముందుగానే రథవీధులను ట్రాక్టర్లతో దున్ని నీళ్లుపోసి సిద్ధం చేశారు. రథంపై నుంచే పూజారులు హారతి ఇచ్చి వెనక్కి రథం మళ్లించారు. గుమ్మడికాయ బలి ఇవ్వడంతో ఈ పుణ్యకార్యం ముగిసింది. ప్రధానంగా రథంపై కలశం చూసేందుకు నవదంపతులు తరలివచ్చారు.



అశేష జనవాహిని నడుమ నీలకంఠేశ్వరుడి రథోత్సవం

వైభవం.. పార్వేట ఉత్సవం

7

● అహోబిలంలో కన్నులపండువగా ఉత్సవం
● కొండదిగొచ్చిన జ్వాలా నృసింహుడు
● దిగువ అహోబిలంలో అన్న కూటోత్సవం

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

వివరాలు 7లో...

బాల సాయిబాబా సేవలు చిరస్మరణీయం

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

కర్నూలు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బాలసాయిబాబా పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం పాత నగరంలోని శ్రీనిలయంలో జరిగిన భగవాన్ బాలసాయి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల సాయి మందిరంలో ఆయనకు నివాళులర్పించి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ బాల సాయి బాబా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చేసిన సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. తనకు బాల సాయిబాబాతో 40 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. సేవా కార్యక్రమాలు కోసం బాలసాయిబాబా ఎవ్వరి దగ్గరా విరాళాలు సేకరించలేదని, విదేశాల నుంచి వచ్చిన నిధులను ఇక్కడి వారిని సేవకు వినియోగించేవారని అన్నారు. బాలసాయిబాబా మొదలు పెట్టిన కార్యక్రమాలను ట్రస్టు ఆధ్వర్యంలో నిరంతరాయంగా కొనసాగిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ టి. రామారావు అభినందనీయుడు అన్నారు. బాలసాయి జయంతి సందర్భంగా పేద ప్రజలకు తోపుడు బండ్లు, కుట్టుమిషన్లు, ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్యే మదనగోపాల్, బాలసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ టి. రామారావు తదితరులు పాల్గొన్నారు.





హాజరైన విదేశీయులు, బాలసాయిబాబా భక్తులు

వైభవం.. పార్వేట ఉత్సవం

- అహోబిలంలో కన్నుల పండువగా ఉత్సవం
- కొండ దిగొచ్చిన జ్వాలా నృసింహుడు
- దిగువ అహోబిలంలో అన్న కూటోత్సవం, కుంభ హారతి
- ఉత్సవ పల్లకిని సాగనంపిన చెంచులు



పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 15(ఆంధ్రజ్యోతి): వేలాదిమంది భక్తుల నారసింహుని నామస్మరణతో అహోబిలం ప్రతిధ్వనించింది. పల్లకిపై కొలువుదీరిన అహోబిలేశుని దర్శనంతో భక్తజనం పైమరచి పోయింది సంక్రాంతి తర్వాత కనుమ రోజు ఆనవాయితీగా నిర్వహించే నృసింహుని పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా సాగింది. సకల దేవతలు హాజరయ్యే తమ కల్యాణోత్సవానికి భక్తులంతా తరలి రావాలని ఆహ్వానించేందుకు సాక్ష్యాత్తు అహోబిలేశుడు గ్రామాలకు పయనమయ్యాడు. ఎగువ అహోబిలంలోని జ్వాలా నరసింహ స్వామి మకర సంక్రాతి పర్వదినాన దిగువ అహోబిలం చేరుకున్నాడు. చెంచు మహిళలు విల్లంబులతో స్వామివారి పల్లకి వెంట సంప్రదాయ నృత్యం చేశారు. కొండదిగిన జ్వాలా నరసింహస్వామికి అహోబిలం మఠం స్థాపనాచార్యులు ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ మూర్తిస్వరూపుడు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తాంబూలం సమర్పించి సమస్త రాజోపచారములచే దిగువ అహోబిలానికి తీసుకువచ్చి విశేష పూజలు నిర్వహించారు.

భక్తుల చెంతకు పయనమైన దేవదేవుడు

వేదపండితుల మంత్రోచ్చరణాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య 45 రోజుల పాటు 32 గ్రామాల్లో భక్తులకు దర్శనభాగ్యం కలిగించేందుకు దేవదేవుడు పయనమయ్యాడు. దిగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా అన్నకూటోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు నివేదించిన అన్నాన్ని చెంచులు, గుడికట్టు, ఆయకట్టు, కర్ణం, రెడ్డి, బోయిలకు పంచిపెట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, వేద పండితులు కుంభహారతి నిర్వహించారు. అనంతరం జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పార్వేట పల్లకిలో కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అశేష భక్తజన సందోహం మధ్య స్వామి వారి పార్వేట పల్లకి దిగువ అహోబిలం నుంచి బయలుదేరుతుండగా చెంచులు విల్లంభులు సంధిస్తూ.. మహిళలు సంప్రదాయ నృత్యం చేస్తూ పార్వేట పల్లకిని సాగనంపారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్, ఆలయ మేనేజర్ మురళీధరన్, సీఏవో రామ మోహన్, వేద పండితుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. శ్రీవారికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పట్టువస్త్రాలు సమర్పించారు. పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు ఎమ్మెల్యే విశేష పూజలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న మహిళలు



పార్వేటకు బయలుదేరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ పల్లకి

మార్కెటింగ్ శాఖలో త్వరలో పదోన్నతులు



కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీ యార్డులో అధికారులు, సిబ్బందికి త్వరలోనే పదోన్నతులు లభిస్తాయని అధికారులు తెలిపారు. కర్నూలు మార్కెట్ కమిటీలో అసిస్టెంట్ సెక్రటరీలుగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు, రెహిమాన్‌లకు గ్రేడ్-3 సెక్రటరీలుగా పదోన్నతి లభించనుంది. సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న కేశవరెడ్డితో పాటు శివన్న, నాగేష్‌లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతి లభించనుంది. కోడుమూరు మార్కెట్ కమిటీలో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేస్తున్న సెక్రటరీ సుందర్‌రాజుకు గ్రేడ్-2 సెక్రటరీగా, అక్కడే పని చేస్తున్న సూపర్‌వైజర్ శ్రీనుకు అసిస్టెంట్ సెక్రటరీగా పదోన్నతి లభించనుంది. వీరంతా తమకు అనుకూలమైన మార్కెట్ కమిటీల్లో పోస్టింగుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

● త్వరలోనే పదోన్నతులు!

కర్నూలు జిల్లాలో వివిధ మార్కెట్ యార్డులో పని చేస్తున్న సెక్రటరీలు, సూపర్‌వైజర్లకు త్వరలోనే పదోన్నతులు లభించనున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఈ ప్రక్రియ చేపడతారు.

- ఏడీఎం నారాయణ మూర్తి

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి 6వ తరగతిలో 80 సీట్లకు గాను మొత్తం 6035 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీ శనివారం ఉదయం 11.30 గంటల నుండి 1.30 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. కర్నూలులో 13 కేంద్రాలు, నంద్యాలలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు రిజిస్ట్రేషన్ నెంబర్, పాస్‌వర్డ్‌గా పుట్టిన తేదీని ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా అడ్మిట్ కార్డును పొందాలన్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్ మరచిపోయిన అభ్యర్థులు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ హెల్ప్-లైన్ నంబర్ సహకారంతో రిజిస్ట్రేషన్ నెంబర్‌ను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈనెల 16వ తేదీన కర్నూలులోని మాంటిస్సోరి (ఏ-క్యాంపు) స్కూలులో జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణలో పరీక్ష నిర్వాహణ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే 085212-29454, 9652350633, 9985738899లకు సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

- ప్రేమ విఫలం కావడంతో...
- ఉమ్మాయిపల్లెలో విషాదం



శివరాఘవరెడ్డి(ఫైల్)

కొలిమిగుండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన యువతి తనకు దక్కలేదన్న ఆవేదనతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అంబటి రామచంద్రారెడ్డి, గంగ శివమ్మలకు కొడుకు, కూతురు ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగించే ఆ దంపతులు కష్టపడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. ఇటీవలే బీటెక్ పూర్తి చేసుకున్న కొడుకు శివరాఘవరెడ్డి(25) బెంగుళూరులో ఐదు నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. దీంతో తమ కష్టాలు గట్టెక్కుతాయని భావించిన తల్లిదండ్రులకు కొడుకు ఆత్మహత్య చేసుకొని తీరని వ్యధ మిగిల్చింది. మూడు రోజుల క్రితం పండుగకు ఇంటికి వస్తున్నానమ్మా.. అంటూ తల్లికి ఫోన్ చేసి చెప్పిన కొడుకు తన స్నేహితులతో కలిసి ఈనెల 13న బెంగుళూరు నుండి ట్రైన్‌లో ధర్మవరం చేరుకున్నాడు. అక్కడి నుండి ఇంటికి రావాల్సిన రాఘవరెడ్డి ధర్మవరంలో లాడ్జి తీసుకొని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలం కావడమే కారణమని తెలుస్తోంది. మంగళవారం వెలుగు చూసిన ఈ ఘటన ఉమ్మాయిపల్లె గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మంత్రి ఇంటిపై డ్రోన్ కలకలం

బనగానపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఇంటిపై డ్రోన్ ఎగరడంతో కలకలం రేగింది. వైసీపీకి చెందిన అబ్దుల్‌ఫైజ్ కుమారుడి వివాహం సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇంటిపై డ్రోన్ ఎగరడంతో టీడీపీకి చెందిన ఇరువురు వ్యక్తులు ఫైజ్‌కు చెందిన ఇరువురు కెమెరా మెన్లపై దాడి చేసినట్లు ఫిర్యాదు తమకు అందినట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అబ్దుల్‌ఫైజ్ తమ అనుచరులతో వచ్చి బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో తమ డ్రోన్ కెమెరా మెన్‌లపై టీడీపీ వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఫిర్యాదును స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఎస్పీ, డీఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పండుగ పూట విషాదం

- వెల్దుర్తిలో కారు ఢీకొని బాలుడి మృతి
- గాలిపటం ఎగురవేయడానికి హైవేకి వెళ్లి వస్తుండగా ఘటన



గిరిచరణ్ (ఫైల్)

వెల్దుర్తి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణం సమీపంలోని ఎన్‌హెచ్-44 రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన గిరిచరణ్ (10) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలివీ.. పట్టణంలోని ఇంద్రానగర్ చెందిన బోయ వెంకటేశ్వర్లు, కళ్యాణి దంపతులు మూడో కుమారుడు గిరిచరణ్ వెల్దుర్తి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో హైవే సమీపంలో తన పెదనాన్న నిర్వహిస్తున్న వాటర్ సర్వీసింగ్ సెంటరు వద్ద బుధవారం ఉదయం తోటి స్నేహితులతో గాలిపతంగులు ఎగురవేసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో హైవే దాటుతుండగా.. కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తున్న ఓ కారు ఆ బాలుడుని ఢీకొట్టింది. దీంతో ఎగిరిపడ్డ గిరిచరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం చెందిన తమిళనాడు హోసూరు చెందిన కారుగా గుర్తించామని, కారు డ్రైవరు దేవేంద్రన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ కుమార్ తెలిపారు.

అగ్ని ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

- చాపిరేవుల టోల్ ప్లాజా వద్ద ఘటన
- బస్సులో సుమారు 45మంది ప్రయాణికులు
- టోల్‌ప్లాజా సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ముప్పు



ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

నంద్యాల క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సమీపంలోని చాపిరేవుల టోల్ ప్లాజా వద్ద మంగళవారం తెల్లవారుజామున సుమారు 4.40 గంటల సమయంలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. అరుణాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఎన్ఎస్‌కె ప్రైవేట్ ట్రావెల్ బస్సు నంద్యాల సమీపంలోని చాపిరేవుల గ్రామం వద్ద ఉన్న టోల్ ప్లాజావద్దకు రాగానే మంటలు వ్యాపించాయి. టోల్‌ప్లాజా సిబ్బంది గమనించి డ్రైవర్, ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో అందరూ వెంటనే బస్సు దిగారు. టోల్ ప్లాజా సిబ్బంది తమ వద్ద ఉన్న అగ్నిప్రమాద నివారణ యంత్రాలతో ప్రమాదాన్ని అరికట్టేందుకు యత్నించినా సాధ్యం కాలేదు. వెంటనే వారు సమాచారాన్ని నంద్యాల అగ్నిమాపక సిబ్బందికి చేరవేశారు. వారు వచ్చి బస్సు అద్దాలను పగులగొట్టి మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక దళ సిబ్బంది మాట్లాడుతూ బస్సు నిర్విరామంగా ప్రయాణం చేయడంవల్ల బస్సు టైర్ల దగ్గర ఉండే వీల్స్ తీవ్ర రాపిడికి గురై వేడితో మంటలు వ్యాపించాయన్నారు. సకాలంలో టోల్‌ప్లాజా సిబ్బంది అప్రమత్తమై తమకు సమాచారం అందించడంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదన్నారు. ఈ బస్సులో సుమారు 45మంది ప్రయాణికులు ఉన్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదంలో బస్సు లోపలి భాగంలో కూడా పాక్షిక నష్టం వాటిల్లింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- నంద్యాల, నందికొట్కూరులో ఘటనలు

నంద్యాల క్రైం/నందికొట్కూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, నందికొట్కూరులో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నంద్యాల పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. శిరివెళ్లకు చెందిన అత్తార్ అస్లాం(26), తిమ్మాపురం గ్రామానికి చెందిన కాకాని కళ్యాణ్ ఇద్దరూ బైకుపై పట్టణంలోని సంజీవనగర్ నుంచి శ్రీనివాస సెంటర్‌కు వస్తుండగా మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అస్లాం మృతి చెందాడు. గాయపడిన కళ్యాణ్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నందికొట్కూరులో..

పట్టణంలో రెండు ద్విచక్రహనాలు ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం పాతకోట గ్రామానికి చెందిన తేజేశ్వరుడు, హరి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా.. నందికొట్కూరు ఏబీఎన్ పాలెం చెందిన రాజు ఓ బైకు ప్రాతకోటకు వెళ్తుండగా మార్గం మధ్యలో పగిడ్యాల రోడ్డు రైస్‌మిల్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ప్రాతకొటకు చెందిన తేజేశ్వరుడు అక్కడికి అక్కడే మృతి చెందగా హరి గాయపడ్డారు. రాజు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హరిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు, రాజును కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తమ దృష్టికి వచ్చిందని, అయితే ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి

- ముగ్గుల పోటీల నిర్వహణ అభినందనీయం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. డీవీఆర్, టీజీవీ గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ముగ్గుల పోటల్లో ప్రతిభ ఆధారంగా విజేతలను ఎంపిక చేశారన్నారు. సంప్రదాయాన్ని గుర్తు చేసేలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాకు రూ.14వేల కోట్ల పెట్టుబడులతో సెమికండక్టర్ పరిశ్రమను ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సరైన సమయంలో రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని, ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల వ్యవధిలోనే లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేశామని చెప్పారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ముందుకెళ్తున్నామన్నారు. 2025 సంవత్సరం కూడా ప్రజలందరికీ ఎంతో మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. డీవీఆర్ గ్రూప్స్ చైర్మన్ డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు, కన్సోలేషన్ బహుమతులను మంత్రి టీజీ భరత్, డీవీఆర్ గ్రూప్స్ చైర్మన్ డి.వెంకటేశ్వరరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్, యాంకర్ రష్మిగౌతమి, యాంకర్ దీప్తి నల్లమోతు హాజరయ్యారు. జబర్దస్త్ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పోలీసు అధికారినని డబ్బు కాజేసిన సైబర్ నేరగాడు

- అరెస్టు చేయకూడదంటే డబ్బులు చెల్లించాలి
- మనీ లాండరింగ్ కేసు ఉందని రూ.32.5 లక్షలు దగా

శిరివెళ్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): 'నేను పోలీసు అధికారిని మాట్లాడుతున్నా.. 18 మనీ లాండరింగ్ కేసుల్లో నీ పాత్ర ఉంది.. అరెస్టు చేయకూడదంటే డబ్బులు చెల్లించాలి' అని చెప్పి విడతల వారీగా యువకుడి నుంచి రూ.32.5 లక్షలు కాజేశాడు ఓ సైబర్ మోసగాడు. ఈ ఘటన శిరివెళ్లలో జరిగింది. శిరివెళ్ల ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివీ.. శిరివెళ్లకు చెందిన నంద కిశోర్ అనే యవకుడికి కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మనీ లాండరింగ్ కేసుల్లో ఇన్వాల్వ్ అయ్యావని.. కేసుల్లో నుంచి బయటపడేందుకు, అరెస్టు చేయకుండా ఉండేందుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో సైబర్ మోసగాడి మాటలకు భయభ్రాంతులకు గురైన బాధితుడు నంద కిశోర్ నిందితుడు ఇచ్చిన పలు బ్యాంకు అకౌంట్లలో విడతల వారీగా రూ.32,50,600 జమ చేశాడు. అనంతరం ఇంకా డబ్బులు ఇవ్వాలని సైబర్ మోసగాడు బెదిరింపులకు పాల్పడుతుండడంతో బాధితుడు నంద కిశోర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రథోత్సవంలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో భక్తుడి మృతి

ఆదోని రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం దిబ్బనకల్లులో విషాదం చోటు చేసుకొంది. రథోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తుడు కురువ వీరేష్(41) విద్యుదాఘాతంతో మృతి చెందారు. వివరాలివీ.. గ్రామానికి చెందిన వీరేష్‌కు 20 సంవత్సరాల క్రితం పెద్దకడబూరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ఆడపిల్ల ఉన్నారు. మంగళవారం రాత్రి గ్రామంలో అఖండప్పతాత రథోత్సవ సమయంలో దేవాలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ బల్బుల తీగలు తగిలి అక్కడిక్కడే కుప్పకూలారు. హుటాహుటిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

- ఇళ్ల ముందు ఆకట్టుకున్న రంగురంగుల ముగ్గులు
- ముగ్గులు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


నంద్యాలలో సోమనందీశ్వరస్వామి కల్యాణం


గడిగరేవులలో పార్వేట


రథాన్ని లాగుతున్న ఎంపీ శబరి, ఎమ్మెల్యే జయసూర్య


కొత్తపల్లిలోని తాండవ మల్లేశ్వరస్వామి కల్యాణం


మిడుతూరులో గోపూజ చేస్తున్న భక్తులు


బండిఆత్మకూరులో వరదరాజస్వామి గ్రామోత్సవం


పాములపాడు: రుద్రవరంలో విజేతలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు రామస్వామి


ఆత్మకూరులో ముగ్గుల పోటీలు


నందికొట్కూరులో బహుమతులు అందజేస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి


కరివేన గ్రామంలో..

నంద్యాల కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆత్మకూరు బస్టాండు సమీపంలో వెలసిన సోమనందీశ్వరాలయంలో ఆలయశాశ్వత ధర్మకర్త బిల్లుపాటి వెంకట శంకరయ్య, అర్చకుల ఆధ్వర్యంలో సోమనందీశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. బుధవారం కనుమ సందర్భంగా సోమేశ్వరీదేవి సమేత సోమనందీశ్వర స్వామి వార్ల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రహీమ్, చెన్నయ్య, వీరభద్రప్ప, మురళి, ఉమ్మయ్య, శివయ్య, నాగరాజప్ప భక్తులు పాల్గొన్నారు.

● నంద్యాల భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సంజీవనగర్ కోదండరామాలయం నుంచి కనుల పండువగా శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విష్ణుభాగ్య రథోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డా.రామక్రిష్ణారెడ్డి, కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారధికృష్ణ, వంకదారిమధుసూదన్, అధికారులు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయమాల్పురం గ్రామంలో శివుఢు, పార్వతి, గంగాదేవి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని వేడుకలను పురస్కరించుకుని ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు గ్రామీణ క్రీడాపోటీలను నిర్వహించారు. పట్టణంలో మంగళవారం సీపీఎం అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్స్ పరుగు పందెం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి స్నేహ స్టడీ సర్కిల్, స్నేస్‌వారి సహకారంతో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. నాయకులు రాజశేఖర్, ఏసురత్నం, రణధీర్, స్నేహ స్టడీ సర్కిల్ కరస్పాండెంట్ పి.నూర్‌బాషా పాల్గొన్నారు.

● ఆత్మకూరులోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకరజ్యోతి దర్శన క్రతువను వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా సంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలైలోని అయ్యప్పస్వామి సన్నిధిలో జరిగే మకరజ్యోతి దర్శన కార్యక్రమం సందర్భంగా స్థానిక భక్తులకు జ్యోతి దర్శనం కల్పించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ తరఫున అల్పాహార వితరణ చేపట్టారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు గ్రామీణ క్రీడాపోటీలను నిర్వహించారు. కరివేన గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో, కొత్తరామాపురంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సీపీఎం, టీడీపీ నాయకులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మకర సంక్రాంతి వేడుకలను రంగ రంగ వైభవంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలకు తిరుమంజన సేవను భక్తి శ్రద్ధలతో జరిపారు. సాయంత్రం ఆలయం ముందు భాగంలో ఈఏడాది ప్రథమంగా ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గంగిరెద్దుల నృత్య ప్రదర్శనతో పాటు హరిదాసు సంకీర్తనలను ఏర్పాటు చేశారు. పరుగు పందెంలో మహానందికి చెందిన కార్తీక్ విజేతగా నిలిచాడు. ఈవో అభినందించి, సత్కరించారు. పారువేట ఉత్సవం ముందు తిమ్మాపురానికి చెందిన చిన్నారుల కోలాట నృత్యం పలువురిని ఆకట్టుకొంది. ముగ్గుల పోటీల విజేతలకు ఆలయ ఈవో బహుమతులు అందజేశారు. ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● బుక్కాపురంలో బుధవారం సాయంత్రం సంక్రాంతి వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కెసీ కెనాల్ చైర్మన్ బన్నూరి రామలింగారెడ్డి గ్రామ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ముగ్గుల పోటీలతో పాటు ఆటపోటీల్లో విజేతలకు కూడా ఆయన బహుమతులు అందజేశారు. గ్రూపు దేవాలయాల ఈవో స్వర్ణముఖి, టీడీపీ నాయకులు నాగపుల్లయ్య, శివ, సుబ్రహ్మణ్యం,మారెడ్డి జయరాం, నాగరాజు, శివ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎ. కోడూరులో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు టీడీపీ నాయకుడు వడుడ మధుసూదన్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

వెలుగోడు(ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో అన్ని గ్రామాలలో సంక్రాంతి పండుగ వేడుకలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందికొట్కూరు, జనవరి(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ అంటే మహిళల పండుగ అని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో కుమ్మరి వీధిలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, కుర్చీల ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వర రావు, నాయకులు గోపాలకృష్ణ, బాబు, ఉస్మాన్ బాషా, అబ్దుల్ రషీద్, పాండు, రాధమ్మ, నాగేశ్వరమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఆడ పడుచులు ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులు వేసి, ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించారు.

● గో జాతి సంరక్షణకు ప్రతి వ్యక్తి కృషి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు ఆమంచి వేంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కనుమ పండగను పురస్కరించుకుని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రం మిడుతూరు లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో గోపూజ, ధార్మిక ప్రవచనాన్ని ఏర్పాటు చేశారు. గోమాతకు విశేష పూజలు నిర్వహించి, వృషభ రాజములతో నగర సంకీర్తన చేశారు. అర్చకులు వెంకట రామయ్య, చెంచు రామ్మోహన్ రావు, జగన్మోహన్ ఆచారి, చిట్టిబాబు పాల్గొన్నారు.

పాములపాడు(ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామం సర్పంచ్, టీడీపీ నాయకుడు రామస్వామి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన మ్యూజిక్ చైర్, తాడు ఆటలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన మహిళలకు బహుమతిగా చీరలు పంపిణీ చేశారు. పాల్గొన్న ప్రతి మహిళకు గిఫ్ట్‌లను అందించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): నెహ్రూనగర్‌లో టీడీపీ నాయకుడు బండి జయరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో గెలుపొందిన వరలక్ష్మికి మొదటి బహుమతి రూ. 1000, రెండో స్థానంలో గెలుపొందిన మానసకు రూ.700, మూడోవ స్థానంలో గెలుపొందిన పి.కవిత కు రూ. 500 బహుమతులను అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ బండి శ్రీనివాసులు అందజేశారు.

● పడమర ప్రాతకోట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర, తూర్పు ప్రాతకోట గ్రామంలోని నాగేశ్వర స్వామి రథోత్సవాలను బుధవారం రాత్రి భక్తులు వైభవంగా నిర్వహించారు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రథాన్ని లాగి ప్రారంభించారు. నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగశేషులు, శ్రీనివాసులు నాయుడు, బాలీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మిద్దె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో వెలసిన పార్వతి సమేత తాండవ మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అశేష భక్తజనం మధ్య పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ, దేవదాయ శాఖ ఈవో, ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఉదయం స్వామివారికి గణపతి పూజ, సభాపూజ, పుణ్యాహవాచనం, రుద్రాభిషేకాలు తదితర ప్రత్యేక పూజాదికార్యక్రమాలు శాస్త్రోత్తంగా నిర్వహించారు. రాత్రి 11 గంటల సమయంలో పురోహితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు భక్తజన సమక్షంలో కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు. బుధవారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బుధవారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు.

● పూర్వపు ఆలయ పురోహితులు కాసులనాటి సుందర రామయ్యశాస్త్రి, అలివేలి మంగమ్మ గారి జ్ఞాపకార్థం వారి మనుమడు పూర్వపు ఆలయ పూజారి పురోహితులు బొల్ల పిన్ని ఉమామహేశ్వరశర్మ వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ.15,116 అన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీతో పాటు దేవదాయశాఖ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం గడివేముల, కరిమద్దెల, గడిగరేవుల గ్రామాల్లో పారువేట నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

పాణ్యం(ఆంధ్రజ్యోతి): సుబ్బరాయుని కొత్తూరు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. సిబ్బంది సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, నారాయణస్వామి, సురేష్ శర్మ, రోహిత్ శర్మ, కృష్ణయ్య స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


రాయమాల్పురంలో..


పాణ్యం: కొత్తూరులో గ్రామోత్సవం


నంద్యాలలో రథోత్సవం


మహానందిలో..


బుక్కాపురంలో..

'ఆ ఈవోను ఎలా నియమిస్తారు?'

పగిడ్యాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సస్పెండ్ అయిన ఈవోను మళ్లీ విధులల్లో ఎలా నియమిస్తారని, ఈవోకు విధుల్లో చేరేందుకు సహకరించిన వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవదాయశాఖ మంత్రికి లెటర్ పంపుతామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. పడమర ప్రాతకోటలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈవోగా విధులు నిర్వహిస్తున్న రమణ అవినీతి, అక్రమాలకు పాల్పడటంతో అతడిని సస్పెండ్ చేశారన్నారు. అయితే విచారణ పూర్తికాకముందే మళ్లీ అతడిని అక్కడే ఈవోగా నియమించడం తగదని అన్నారు. ఈవోను విధుల్లోకి చెరేందుకు కొంత మంది నాయకులు సహకరించారని, ఈవో, సహకరించిన వారిపై ఎంపీ బైరెడ్డి శబరితో సీఎంకు లెటర్ పంపి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు ఆల్లీవుసేన్, దశరథరామిరెడ్డి, అజీమ్, శ్రీను తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

కొత్తపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో తాండవ మల్లేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, దాతల సహకారంతో నిర్వహించిన పాలపండ్ల బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన అక్షర రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో, వెల్దుర్తి మండలానికి చెందిన రమేష్ నాయుడు ఎద్దులు రెండో విజేతగా, గద్వాల జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన గోవర్ధన్ ఎద్దులు మూడో విజేతగా నిలిచాయి. మిడ్తూరు మండలానికి చెందిన సాయివర్ధన్ ఎద్దులు నాలుగో స్థానంలో, జూపాడు బంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా ఎద్దులు ఐదు, బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నాగేంద్ర ఎద్దులు ఆరు, ఓర్వకల్లు మండలం బాపనపల్లె చెందిన కొక్కెర్ల చెందిన ఎద్దులు ఏడు, ఓర్వకల్లు మండలం బాపనపల్లె చెందిన మల్లు మౌలాలి ఎద్దులు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. పోటీలను కొత్తపల్లి ఎస్ఐ కేశవ ప్రారంభించగా.. ఆలయ కమిటీ గ్రామ పెద్దలు, రైతులు, దాతలు పాల్గొన్నారు. వరుసగా బహుమతులు రూ.30 వేలు, రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు,రూ.5వేలు, రూ.3వేలు, రూ.2 వేలు అందజేశారు.


పడమర ప్రాతకోటలో పోటీలను ప్రారంభిస్తున్న బైరెడ్డి


కొత్తపల్లిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ కేశవ

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): పడమర ప్రాతకోట గ్రామంలో నిర్వహించే తిరుణాల ఉత్సవాలలో బాగంగా అంతర్ రాష్ట్రస్థాయి న్యూకేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలను బుదవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి నాలుగు బహుమతులు రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ. 10వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నాగేశ్వరస్వామి ఆలయంలో బైరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆల్లీవుసేన్, దశరథరామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

బాదుల్లా స్వామి సరిగెత్తు


పెద్దదేవళాపురంలో పీర్ల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బండిఆత్మకూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవళాపురంలో బాదుల్లా స్వామి సరిగెత్తు ముగిసింది. బాలసాయి సీడ్స్ అధినేత పాత్‌లావత్ కృష్ణనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం స్వామి వారి జెండా, గంధోత్సవాలతో సరిగెత్తు ప్రాంభమైంది. అదే రోజు రాత్రి భక్తులు స్వామి వార్లకు కానుకలు సమర్పించుకున్నారు. బుధవారం సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం అనంతరం వేడుకలు ముగిశాయి.

వెలుగోడు (ఆంధ్రజ్యోతి): మోతుకూరులో మౌలాలి స్వామి సరిగెత్తు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పీర్లను నిమజ్జనం చేశారు.


మోతుకూరులో మౌలాలి స్వామి సరిగెత్తు

పుస్తక పరిచయ సభ

నంద్యాల కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నందిరైతు సమాఖ్య కార్యాలయంలో బుధవారం విశ్రాంత ఐఎఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు రచించిన 'భాష కోసం పోరాటం' అనే పుస్తకాన్ని పునఃఆవిష్కరించారు. విశ్రాంత శాస్త్రవేత్త డా. రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రచయిత డాక్టర్ దోనెపూడి నరేష్‌బాబు (పుస్తక విశ్లేషకుడు), డిప్యూటీ రిజిస్ట్రార్ డీవీఎస్ శాస్త్రి, వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. తెలుగుభాష ఉనికికి ప్రమాదం ఏర్పడుతున్న ఈ రోజుల్లో ముక్తేశ్వరరావు రచించిన భాషోద్యమ పుస్తకాలు తెలుగు భాష ఉనికిని కాపాడుకొని మన సంస్కృతి సాంప్రదాయాలను నిలబెట్టుకోవడానికి దోహదపడుతాయని వక్తలు పేర్కొన్నారు. శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, మాబుబాషా, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, డాక్టర్ కిషోర్‌కుమార్, రఫీ, ప్రసాద్, నరేంద్ర, శాస్త్రవేత్త కైలాస్‌నాథ్‌రెడ్డి, విట్టా రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృత్యార్చన

నంద్యాల కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నంద్యాల పద్మావతి నగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో వైభవంగా నృత్యార్చన చేశారు. నృత్యార్చనలో పాల్గొన్న కళాకారులకు బుధవారం హైదరాబాదుకు చెందిన పోలీస్ అకాడమీ సంస్థ నిర్వహకులు వీరసింహులు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి నృత్యకారిణికి రూ.500 చొప్పున నగదు బహుమతితో పాటు, షీల్డ్ ప్రదానం చేశారు. ఆలయ అధ్యక్షుడు పార్థసారధికృష్ణ, విజయ చంద్రుడు, దేశు రాధాప్రసాద్, వెంకటేశ్వర్లు, రాధాలక్ష్మి తదితరలు పాల్గొని బహుమతులు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పాములపాడు జనవరి 15 (ఆంధ్రజ్యోతి): లింగాల గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. తుమ్మల వెంకటరామిరెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,45,550 చెక్కును బుధవారం టీడీపీ నాయకులు చెల్లె బాలీశ్వరరెడ్డి, జంబులయ్య చేతుల మీదుగా ఎంపీ అందించారు. కార్యక్రమంలో నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

మహానంది, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి- చలమ రైల్వే ట్రాక్‌పై 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు నంద్యాల రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. మృతదేహం ఉన్నట్లు బుధవారం స్థానికులు సమాచారం ఇచ్చారని చెప్పారు. తెల్లని టీ షర్ట్, నల్లని ప్యాంటు ధరించి చామన ఛాయ రంగుతో 5.6 అడుగుల మేర ఎత్తు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లమలలో కార్లు ఢీ

మహానంది, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నల్లమలలోని సర్వనరసింహ స్వామి ఆలయం ప్రధాన రహదారి వద్ద ఈనెల 12న రెండు కార్లు ఢీ కొన్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. నంద్యాల వైపు నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు కు వెళ్తున్న కర్నూలుకు చెందిన చైతన్య కారును అనంతపురం జిల్లాకు చెందిన కారు అదే రహదారిలో వెళ్తూ సర్వనరసింహ స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిలో అదుపుతప్పి వెనుక వైపు ఢీ కొందన్నారు. ఈప్రమాదంలో చైతన్య కారు పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్‌రెడ్డి

పగిడ్యాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా తూర్పు ప్రాతకోట గ్రామంలోని గంగా పార్వతి, నాగేశ్వరస్వామి తిరుణాల సందర్భంగా మంగళవారం జాతీయ స్థాయి మహిళ కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్. హరినాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శేషమ్మ ప్రారంభించారు. ఈ పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు హాజరు కావడంతో దేవాలయ ఆవరణం ఈలలు, కేరింతలతో మార్మోగింది.

క్రికెట్ విజేత గడివేముల జట్టు

ఆత్మకూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముష్టపల్లి గ్రామంలో ముష్టపల్లి గ్రామ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గడివేముల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ముష్టపల్లి గ్రామ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ దేశావత్ ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు గెలుపొందిన టీంలకు ట్రోఫిలను అందజేశారు. మొదటి బహుమతిగా గడివేముల టీంకు రూ.40,016, రెండో బహుమతి ముష్టపల్లి జట్టుకు రూ20,016, మూడోది సోమాపురం టీమ్‌కు రూ.10,016 నిర్వాహకులు అందజేశారు.

జంప్‌రోప్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలికి చెందిన మహబూబ్‌బాషా, నూర్జాజన్ దంపతుల కుమార్తె మదిహా అంతర్జాతీయస్థాయిలో నేపాల్‌లో జరిగిన జంప్‌రోప్ పోటీలో ప్రతిభ కనబరిచింది. ఈనెల 5న నేపాల్ దేశంలోని పొకారాలో జరిగిన జంప్‌రోప్ పోటీలో పాల్గొని గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఫిబ్రవరి 15న జపాన్‌లో జరిగే జంప్‌రోప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ తెలిపారు. బుధవారం గ్రామంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మదిహాను గ్రామసర్పంచ్ మౌలిబాషా, టీడీపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, నరసింహారెడ్డి, శారదాదేవిలు పూలమాల వేసి అభినందించారు.

హోరాహోరీగా షటిల్ టోర్నమెంట్

శిరివెళ్ల, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ పోటీలు రెండు రోజులపాటు హోరాహోరీగా సాగాయి. యర్రగుంట్లకు చెందిన చల్లా సంజీవ, ఆల మధు సుధాకర్ జట్టు ప్రథమస్థానం, శిరివెళ్లకు చెందిన బాషా జట్టు ద్వితీయస్థానం సాధించాయి. విజేతలకు సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిన్న పీరయ్య బహుమతులు పంపిణీ చేసి అభినందించారు. పోలీస్ సిబ్బంది నరసింహులు, కృష్ణమోహన్, నాగేష్, మద్దిలేటి, ప్రసన్న కుమార్, శేషన్న, విజయ్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పట్టణంలో .. :
క్రీడలకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ పోటీలను డీఎస్పీ ప్రారంభించారు. రమణ టీం ప్రథమస్థానంలో నిలిచి రూ.6 వేలు, సంజీవ టీం ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, పటాన్ టీం తృతీయ బహుతిగా రూ.2 వేలు నగదును కైవసం చేసుకున్నాయి. విజేత జట్లకు డీఎస్పీ రవి కుమార్ ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. స్టేడియం అధ్యక్షుడు గంగన్న, కోచ్ రమణ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాములకు తెప్పోత్సవం


రామచంద్రాపురం గ్రామంలో తెప్పోత్సవంలో అర్చకులు

దొర్నిపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని సీతారాముల కల్యాణం అనంతరం గ్రానమంలోని నీటి కుంటలో తెప్పోత్సవ కార్యక్రమం ఘనంగా చేపట్టారు. స్వామి వారి కల్యాణం, తెప్పోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు అధిక తరలివచ్చారు.

పోలీసుల అదుపులో వైసీపీ కీలక నాయకుడు?

డోన్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని గుత్తి రోడ్డులో ఈ నెల 6న రాత్రి 9.20 గంటల సమయంలో డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ తన స్కూటిపై వెళ్తుండగా.. వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో వైసీపీకి చెందిన మండల స్థాయి కీలక నాయకుడి పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తూ డోన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం . మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కారుతో ఢీకొట్టిన వ్యక్తి కూడా వైసీపీకి చెందిన కార్యకర్తగా భావిస్తున్నారు. సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతన్ని విచారించగా.. వైసీపీ చెందిన మండల స్థాయి కీలక నాయకుడి పేరు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు డోన్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాను వివరణ కోరే ప్రయత్నం చేయగా.. అందుబాటులోకి రాలేదు.

బుగ్గానిపల్లెలో చెన్నకేశవస్వామి ఊరేగింపు

బేతంచెర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గానిపల్లె గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి ఊరేగింపు అశేష జనవాహిని మధ్య బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని గంగమ్మ బావి దగ్గర నుంచి మంగళవాయిద్యాల మధ్య చెన్నకేశవ స్వామి ఊరేగింపు ప్రారంభమైంది. భక్తుల కొరడాలతో కొట్టుకున్నారు. ఊరేగింపును తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రమేష్ బాబు గట్టి బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో చెన్నకేశవ స్వామి ఆలయ నిర్వాహకులు నాయుడు, కేశాలు, నరసింహుడు, రవి, తిరుపతయ్య, భక్తులు పాల్గొన్నారు.

పప్పు శనగ పాయే

- తెగుళ్లు, ముసురు కారణంగా భారీగా దెబ్బతిన్న పంట
- దిగుబడి రెండు, మూడు క్వింటాళ్లకు మించి రాదంటున్న రైతులు

కొలిమిగుండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రబీలోనైనా తమ కష్టాలు గట్టెక్కుతాయని ఆశించిన అన్నదాతలకు ఇటీవల వాతావరణ పరిస్థితులు తీవ్ర నిరాశే మిగిల్చాయి. ముఖ్యంగా రబీలో అత్యధికంగా సాగు చేసిన పప్పు శనగ పంట తెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు లక్షల హెక్టార్లలో రైతులు శనగను సాగు చేశారు. ఏపుగా పెరిగి కళకళలాడిన పంటపై అన్నదాతలు పెద్ద ఎత్తున ఆశలు పెంచుకున్నారు. అయితే గత 20రోజుల నుంచి ఏర్పడిన వాతావరణ పరిస్థితులు అన్నదాతల ఆశలను ఆవిరి చేశాయి. ముఖ్యంగా వరుస తుఫాన్‌లతో శనగ పంటకు వేరు కుళ్లు తెగులు సోకింది. దీంతో బనగానపల్లె, కోవెలకుంట్ల వ్యవసాయ డివిజన్‌లతో పాటు, జిల్లాలోని అనేక ప్రాంతాల్లో శనగ పెద్ద ఎత్తున చనిపోయింది. మరో వైపు ముసురు వాతావరణం శనగ రైతుల కొంప ముంచింది. సుమారు పది రోజుల పాటు ఎడతెరిపి లేకుండా ఉదయం సమయంలో పొగ మంచు కురిసింది. దీంతో పచ్చని పంటలకు ఉన్న పూత, పిందె మొత్తం రాలిపోయింది. ముసురు కారణంగా తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేసినా అదుపులోకి రాలేదు. దీంతో శనగ పెద్ద ఎత్తున దెబ్బతిన్నట్లు అన్న దాతలు వాపోతున్నారు.


కుళ్లిన శనగ సాగు

వాతావరణ పరిస్థితుల కారణంగా శనగ భారీగా దెబ్బతిని, దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8నుండి 10క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉన్న పంట, ప్రస్తుతం 2, 4క్వింటాళ్ల కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. శనగ ధర క్వింటాళ్‌కు రూ.6000 మించడంలేదు. వచ్చే దిగుబడితో పోల్చి చూస్తే నష్టలేనని పేర్కొంటున్నారు.

సగం పైరు ఎండిపోయింది



14ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. వేరు కుళ్ల తెగులు కారణంగా సగానికి పైగా పైరు ఎండిపోయింది. దీంతో తీవ్రంగా నష్టపోయాను.

- నటరాజేశ్వరరెడ్డి, రైతు, నందిపాడు

పెట్టుబడులు కూడా రావు



వాతావరణ పరిస్థితుల కారణంగా నాగిశెట్టిపల్లె, ఎర్రగుడి, హనుమంతు గుండం, తిమ్మనాయినిపేట తదితర గ్రామాల్లో శనగ భారీగా దెబ్బతినింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలి.

- రంగస్వామి, రైతు - నాగిశెట్టిపల్లె

పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన


జుర్రేరు వాగును పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొని బిజీగా గడిపారు. పట్టణంలో అన్యాక్రాంతమైన జుర్రేరువాగును మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డితో కలసి పరిశీలించారు. అక్రమ కట్టడాలపై ఆరా తీశారు. దీంతో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు అవసరమైన కసరత్తుపై చర్చించారు. ఇరిగేషన్ అధికారులు వాగుకు ఇరువైపులా హద్దులను ఏర్పాటు చేశారు. వాటిని మంత్రి పరిశీలించారు. పట్టణంలోని మురుగునీరు కలవకుండా చేయాలని పంచాయతీరాజ్, మైనర్ ఇరిగేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన
బనగానపల్లె పట్టణంలో ఆస్థానం రోడ్డు వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను బుధవారం స్వయంగా మంత్రి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా శరవేగంగా పనులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈ నాగశ్రీనివాసులుకు సూచించారు.

పశు వైద్యశాల తనిఖీ
బనగానపల్లె పట్టణంలోని పశువైద్యశాలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిథిలమైన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. అలాగే సిబ్బంది ఉండే గదులను, ప్రయోగశాలను ఆయన పరిశీలించారు. ఉద్యోగుల అటెండెన్సును పరిశీలించారు. పశువుల సంచార వాహనాన్ని పరిశీలించారు. విధులకు సక్రమంగా నిర్వహించి రైతులకు సేవలందించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో ముళ్ల కంపను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మందుల కొరత లేదని పశు వైద్యశాఖ ఏడీ డాక్టర్ మారుతీసకారం మంత్రికి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, సిబ్బంది వరప్రసాద రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల సిబ్బందిపై మంత్రి ఆగ్రహం
కస్తూర్బా పాఠశాలను మంత్రి పరిశీలించారు. పాఠశాల ఆవరణం ముళ్ల కంపలతో నిండి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్తూర్బా పాఠశాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

నేడు షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ
బనగానపల్లె: పట్టణంలో పాతబస్టాండ్‌లో సుమారు రూకోటి వ్యయంతో షాదీఖానా నిర్మించనున్నారు. గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి భూమి పూజ చేయనున్నారు. ఎన్నో ఏళ్లగా షాదీఖానా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద ముస్లింల కల నెరవేరనుంది.

వైభవంగా పార్వేట ఉత్సవాలు


గొడిగనూరులో సీతారాములతో పల్లకి ఉత్సవం చేస్తున్న గ్రామస్థులు

చాగలమర్రి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు, గొడిగనూరు, చిన్నబోదనం, పెద్దవంగలి, ముత్యాలపాడు గ్రామాల్లో బుధవారం పార్వేట ఉత్సవాలను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. మద్దూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే పల్లకీ ఉత్సవం నిర్వహించారు. వేద పండితులు కిషోర్‌శర్మ, సాయిశర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ శివార్లలో గొర్రె తోకను కోసి సున్నం తగిలించడంతో గొర్రె పరుగు తీసింది. పొలాల్లో పరిగెత్తిన గొర్రెను పట్టుకునేందుకు యువకులు పరుగు తీశారు. ఈ పోటీలో వెంకటేష్ అనే యువకుడు గొర్రెను పట్టుకొని విజేతగా నిలిచారు. గొర్రెను బహుమతిగా గ్రామ పెద్దలు అందజేశారు. గొడిగనూరు, పెద్దవంగలి గ్రామాల్లో సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తు లకు, చిన్నబోదనంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే పార్వేట, పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్‌ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బనగానపల్లె: మండలంలోని ఆయా గ్రామాల్లో పార్వేట సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఎర్రమల్ల కొండల్లో కొలువైన యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి పార్వేటు ఉత్సవానికి పల్లకీలో బుధవారం ఉదయం ఐదు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో చంద్రుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులు మహేశ్ పాల్గొన్నారు. అలాగే బనగానపల్లె మండలం భానుముక్కల, పలకూరు గ్రామంలో గ్రామోత్సవాలను నిర్వహించారు.


రుద్రవరం: పార్వేట రథంలో కొలువుదీరిన సత్యనారాయణస్వామి, లక్ష్మీదేవి అమ్మవారు

రుద్రవరం : రుద్రవరంలో సంక్రాంతి, కనుమ సందర్భంగా బుధవారం పార్వేట పల్లకీ ఉత్సవాలు నిర్వహించారు. భాస్కరనందీశ్వరస్వామి అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. సత్యనారాయణస్వామిని రథంలో కొలువుదీర్చి పార్వేట గావించారు. పార్వేట ఉత్సవం సందర్భంగా పరుగు పందెం నిర్వహించారు. విజేతలకుక నిర్వాహకులు క్రిష్ణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు.

కోవెలకుంట్ల : పట్టణంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి పార్వేట ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పాండురంగ విఠలేశ్వరస్వామిని రథంపై ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఎక్కించుకుని పాండురంగ స్వామి దేవాలయం నుండి స్వామివారిని ఊరేగింపుగా ఆయా గ్రామాల్లో తిరిగి రాత్రి కోవెలకుంట్లకు చేరుకుంది.

ప్రజలపై భారం మోపడం దారుణం


మంటల్లో కరెంటు బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి కోయల కొండ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని కొట్ల వారిపల్లె గ్రామంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనగా కరెంటు బిల్లుల ప్రతులను మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు రామాంజనేయులు, నాగన్న, చిన్న రెహిమాన్, నాగమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అమడాలను కలిసిన బాలనాగన్న

కోవెలకుంట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటిని డీవీఎంసీ సభ్యుడు బోధనం బాలనాగన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మాలతో సత్కరించారు. అనంతరం మద్దిలేటి మాట్లాడుతూ బోధనం బాలనాగన్నకు డీవీఎంసీ పదవి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఎలక్ట్రికల్ మధు, అమడాల దళిత నాయకులు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మకర జ్యోతి మహోత్సవం


చాగలమర్రి అయ్యప్ప ఆలయంలో వెలుగుతున్న మకర జ్యోతి

చాగలమర్రి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్ప ఆలయంలో మంగళవారం రాత్రి మకర జ్యోతి దర్శనం భక్తులకు కల్పించారు. ప్రతి ఏటా శబరిమలైలో మకర జ్యోతి దర్శనం మాదిరిగానే ఇక్కడి ఆలయంలో ఆనవాయితీగా మకర జ్యోతిని ఎం.రాధాకృష్ణామూర్తి మనవడు అనిష్ జ్యోతిని వెలిగించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి విశేష పూజలు చేశారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా గృహమద్దిలేటిస్వామి ఊరేగింపు


చిన్నవంగలిలో గృహమద్దిలేటిస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

చాగలమర్రి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గృహ మద్దిలేటి స్వామి ఉత్సవమూర్తులతో మంగళవారం గ్రామోత్సవం చేశారు. వేద పండితుడు ఫణిరాజశర్మ ఆధ్వర్యంలో గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగింపు చేశారు. గ్రామస్థులు మద్దిలేటిస్వామికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

బేతంచెర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-కర్నూలు ప్రధాన రహదారిలో పారిశ్రామిక వాడ అయ్యాలచెరువు ప్రాంతంలో కారు అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదం మంగళవారం చోటు చేసుకుంది. అమర్ నాపరాళ్ల ఫ్యాక్టరీ యజమాని రాంపుల్లయ్య కారులో రేణుకా ఎల్లమ్మ ఆలయానికి వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు టైరు పంక్చర్ కావడంతో డీవైడర్‌ను తగిలి సమీపంలోని మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్నది. అయితే కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాలతో బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి విద్యుత్ సిబ్బంది పరిస్థితిని పరిశీలించారు.

దళిత నేత బాలసుందం

బనగానపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో బుధవారం దళిత నేత బాలసుందరం చిత్రపటానికి నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 30 ఏళ్ల దళిత జాతికోసం పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు దస్తగిరి, మద్దిలేటి, మారం నాగరాజు, స్వామిదాస్, రాజేంద్ర, శివుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

బేతంచెర్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. భోగి సందర్భంగా చిన్న పిల్లలకు రేగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అలాగే మంగళవారం సంక్రాంతి పండుగ వేడుకలను తమ ఇళ్ల ముందు మహిళలు యువతులు అందమైన ముగ్గులు వేసి నవధాన్యాలతో కూడిన గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. అలాగే వెంకటేశ్వరస్వామి, మద్దిలేటి స్వామి, ఆంజనేయస్వామి, చౌడశ్వరి, సుంకులా పరమేశ్వరి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కనుమ పండుగను పురస్కరించుకుని పట్టణంలో ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఏర్పాటు చేసి పూజలు చేసి ఆలయం నుంచి పుల్లమ్మ కళ్లం వరకు ఊరేగింపు పార్వేట నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మారుతి కృష్ణన్, పుల్లారెడ్డి, పారిశ్రామికవేత్త హుశేన్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజినేయస్వామి, వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, పెద్దమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు.


బేతంచెర్లలో కనుమ పండుగ రోజు వేసిన రథం ముగ్గు

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో గత రెండు రోజులుగా సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉయ్యాలవాడ గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే యువకులను పరుగు పందం నిర్వహించి బహుమతులు అందించారు. బుధవారం సాయంత్రం గ్రామంలోని కోదండరామస్వాముల వారికి గ్రామోత్సవం చేశారు. మాయలూరు గ్రామంలో చెన్నకేశవుల స్వామి గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోరెడ్డి నర్శిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కొర్రపాటి శివనారాయణరెడ్డి, ఈడిగ పుల్లయ్య తదితరులు ఉన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామీణ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. దీంతో అత్యంత ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచిన విజయ్ జట్టు సభ్యులకు రూ.10వేలు నగదు బహుమతితో పాటు, ట్రోఫీని వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి సోదరులు అందజేశారు. బెలుం గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు పోలిరెడ్డి రాఘవ రెడ్డి, బాచం మహేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు.


చనుగొండ్లలో ఎంఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల ముగ్గుల పోటీలు

వీధుల్లో రంగవల్లుల కళకళలు
తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతి పర్వదిన వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం మకరసంక్రాంతి పురస్కరించుకొని మహిళలు వీధుల్లో రంగవల్లులు అలంకరించారు. దీంతో వీధులన్నీ ముగ్గులమయంగా కనిపించాయి. కొలిమిగుండ్లలో ప్రసిద్ధ లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు పేరం సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, నంద్యాల శివశంకరరెడ్డి, ఆలూరు రాఘవేంద్రప్రసాద్ తదితరులు ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు.

దొర్నిపాడు: దొర్నిపాడు, రామచంద్రాపురం, భాగ్యనగరం, కొండాపురం, గుండుపాపల, చాకరాజు వేముల తదితర గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు కబడ్డీ, ముగ్గుల పోటీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అవుకు: పట్టణంలోని కుమ్మరిదిడ్డి యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు బుగ్గ నాగార్జున, మిక్కినేని మనోహర్ తెలిపారు. నిర్వాహకులు నాగార్జున మాట్లాడుతూ ముగ్గులు వేసిన విజేతలను వినూత్న రీతిలో ఎంపిక చేశామన్నారు. మహిళలు వేసిన ముగ్గులను ఇన్స్టాగ్రామ్ (అవుకు అఫీసియల్)లో అప్‌లోడ్ చేశామన్నారు. అత్యధికంగా లైకులు సాధించిన శింగంశెట్టి గీతాంజలి ప్రథమ బహుమతిని సాధించగా, పత్తి పద్మజ ద్వితీయ బహుమతి సాధించిందన్నారు. ఈ వినూత్న విధానం మహిళలకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యువకులు కిరణ్, మనోజ్, గంగాధర్, విజయ్, హర్షవర్ధన్, అరవింద్ పాల్గొన్నారు.


బేతంచెర్లలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


ప్యాపిలి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఉయ్యాలవాడలో కోదండ రామస్వాములకు గ్రామోత్సవం చేస్తున్న గ్రామస్థులు


కొలిమిగుండ్లలో నగదు బహుమతి, ట్రోఫీ అందజేస్తున్న వైసీపీ కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి


అవుకులో విజేతలకు బహుమతులను అందిస్తున్న నిర్వాహకులు


డోన్‌లో మహిళలకు విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం